

నులి పురుగులను నులిపేద్దాం..

- అల్‌బెండాజోల్ మాత్రల పంపిణీకి ఏర్పాట్లు
- జిల్లాలో 1.42 లక్షల మంది లక్ష్యం
- నేడు జాతీయ నులిపురుగుల నివారణ దినం

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

అపరిశుభ్రతే అన్నింటికీ కారణం. అపరిశుభ్రతతో పిల్లల కడుపులో నులిపురుగులు పెరుగుతాయి. వ్యక్తిగత పరిశుభ్రత లేకపోవడంతో ఏర్పడే నులిపురుగుల నివారణ కోసం నేషనల్ డీ వార్మింగ్ డేను నిర్వహిస్తున్నారు. ఈ నెల 20న జిల్లా వ్యాప్తంగా నేషనల్ డీవార్మింగ్ డే నిర్వ హించేందుకు వైద్య ఆరోగ్య శాఖ ఏర్పాట్లు చేసింది. 20వ తేదీన మాత్రలు వేసుకోని వారికి 27న మాత్రలు వేస్తారు.

● నులి పురుగులతో పిల్లల్లో రక్త హీనత

పిల్లల్లో పోషకాహార లోపం రక్త హీనత, శారీరక మానసిక అభివృద్ధి వంటి వాటిపై ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఎన్ని చర్యలు చేపట్టినా ఇంకా అనారోగ్య సమస్యలతో సతమతమవు తున్నారు. ముఖ్యంగా సంవత్సరం పిల్లవాడి నుంచి 19 సంవత్సరాల యువకుడి వరకు పొట్టలో పెరిగే పురుగులతో బాధపడుతూనే ఉంటారు. నులి పురుగులు, కొంకి పురుగులు, కొరడా పురుగులు, బద్దె పరుగులు, ఏలిక పాములు, దారపు పురుగులు ఇలాంటివి పొట్టలో చేరి అనేక రోగాలకు కారణమవుతుంటాయి. వీటి నివారణ కోసం వైద్య ఆరోగ్య శాఖ ఏటా జాతీయ నులిపురుగుల దినాన్ని నిర్వహిస్తోంది. జిల్లాలో 19 సంవత్సరాలలోపు వారు లక్ష 42 వేల 152 మంది ఉన్నారు. జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల్లో 36 వేల మంది చిన్నారులు ఉండగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో 80 వేల మంది ఉన్నారు. మిగతా 19 ఏళ్లవారు కూడా జిల్లాలో పని ప్రదేశాల్లో ఉన్నారు.

● వయస్సును బట్టి మాత్ర

జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా పంపిణీ చేసే అల్‌బెండాజోల్ మాత్రలను వయస్సును బట్టి వేసుకోవాల్సి ఉంటుంది. ఒకటి నుంచి 2 సంవత్సరాల పిల్లలకు సగం మాత్రను, 2-3 సంవత్సరాలలోపు పిల్లలకు ఒక మాత్రను పొడిచేసి నీళ్లలో కలిపి మింగించాలి. ఆపైబడిన వారికి 400 ఎంజీ అల్‌బెండాజోల్ మాత్రను చప్పరించి లేదా నమిలి మింగించాలి.

● పొట్టలో పురుగులు

అపరిశభ్రతతో అనేక పురుగులు పిల్లల పొట్టలోకి చేరిపోతాయి. పిల్లలు తినే ఆహారాన్ని లోపల ఉండే పురుగులు దర్జాగా తింటాయి. అపరిశభ్రతతో నులిపరుగులు, ఇతర పురుగులు మన పొట్టల్లో వృద్ధి చెందుతాయి. పిల్లలు మట్టిలో ఆడుకొనివచ్చి ఆదే చేత తింటూ ఉంటారు. పిల్లలే కాదు పెద్దవాళ్లు అలా కనిపిస్తుంటారు. బియ్యం ఏరుతూ మహిళలకు మట్టిగడ్డలు తినే అలవాటు ఉంటుంది. మట్టిలోని పురుగుల గుడ్లు మన పొట్టలోకి చేరుతాయి. మలం మీద వాలిన ఈగలు తిరిగి మనం తినే ఆహారపదార్థాల మీద వాలిన సందర్భాల్లోనూ పురుగుల గుడ్లు ఆహారం మీద ఉండిపోతాయి. మంచినీటి పైపులైన్లలో డ్రైనేజీ నీళ్లు కల వడంతో గుడ్లు కడుపులోకి చేరుతాయి. పెరిగిన గోళ్లలో ఇరుక్కున్న మట్టితో గుడ్లు పొట్టలోని చేరుతాయి.

మాత్రల పంపిణీకి ఏర్పాట్లు

- డాక్టర్ సుమన్ మోహన్ రావు, డీఎంఅండ్‌హెచ్‌వో

జిల్లా వ్యాప్తంగా జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం సందర్భంగా అల్బెండాజోల్ మాత్రలను ఉచితంగా పంపిణీ చేస్తున్నాం. వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు జూన్ 20న మాత్రలు అందిస్తారు. ఎవరైనా వేసుకోని వారు ఉంటే 27వ తేదీని అందిస్తాం.

అవగాహన కల్పించాలి

- అదనపు కలెక్టర్ పూజారి గౌతమి

నులిపురుగుల నివారణపై తల్లిదండ్రులకు, పిల్లలకు అవగాహన కల్పించాలని, 1 - 19 ఏళ్ల పిల్లలకు విధిగా అల్‌బెండాజోల్ మాత్రలు వేయించాలని అదనపు కలెక్టర్ పూజారి గౌతమి సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధ్యక్షతన టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారిగౌతమి మాట్లాడుతూ గురువారం నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణ దినం కోసం జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలతో పాటు తల్లిదండ్రులకు అవగాహన కల్పించి మాత్రలు వేయించాలన్నారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుమన్ మోహన్‌రావు మాట్లాడుతూ జిల్లాలో 142152 మంది మాత్రలు వేయాలనే లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. డీపీవో వీరబుచ్చయ్య, జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, డీఈవో రమేష్‌కుమార్, డీఐఈవో మోహన్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ రజిత, డాక్టర్ నయూమా, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు, లావణ్య, అన్వేష్, తదితరులు పాల్గొన్నారు.

● పురుగులు.. లక్షణాలు నివారణ

నులి పురుగులు సన్నగా తెల్లగా దారం పోగుల్లా ఉంటాయి. మనిషి శరీరంలో ఆరు రోజులపాటు బతు కుతాయి. మల ద్వారం చివరలోకి వచ్చి అక్కడ గుడ్లు పెట్టి దురదను కలిగిస్తాయి. నులిపురుగులు ఉన్న పిల్లలకు కట్ డ్రాయర్లు వేయాలి. ఎల్లప్పుడూ చేతులను శుభ్రంగా కడగాలి. గోళ్లను పొట్టిగా కత్తిరించుకోవాలి. కొంకిపురుగులు పాదాల దగ్గర చర్మంలోకి ప్రవేశించి రక్తంలో కలిసి పేగుల్లోకి చేరుతాయి. మనిషికి రక్తహీనతను కలిగిస్తాయి. కొరడా పాములతో విరేచనాలు, కడుపులో నొప్పి, వికారం, రక్త హీనత వంటి లక్షణాలు ఉంటాయి. బద్దెపురుగులు వీటినే నట్టలు అంటారు. సరిగ్గా ఉడికి ఉడకని ఎద్దు, పంది, మాంసం తింటే లార్వాలు పొట్టలోకి చేరి బద్దెపురుగులుగా మారుతాయి. తల పోటు, ఫిట్స్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. కడుపునొప్పి ఆకలి లేకపోవడం. బరువు కోల్పోతారు. ఉడకని మాంసం తినవద్దు. ఏలిక పాము మిగతా పురుగులు లాగానే పొట్టలోకి చేరుతాయి. ఊపిరితిత్తుల్లోకి చేరడంతో దగ్గు, ఒక్కోసారి జ్వరం తెమడ వస్తుంది. అజీర్ణం, నీరసం, వికారం వాంతులు వస్తాయి. పిల్లలకు పెద్ద బానా పొట్ట కనిపిస్తుంది. దారపు పురుగులు ఇవి రెండు మిల్లీ మీటర్ల పొడవు ఉంటుంది. చిన్న పేగుల్లో ఉండడంతో ఆహార లోపాలు వస్తాయి. వీటన్నింటి నివారణకు అల్బెండాజోల్ మాత్రాలు వాడితే సరిపోతుంది. ఇతరవ్యాధులకు మందులు వాడతున్నవారు వేసుకోవద్దు.

చేనేత జౌళి శాఖ అధికారులతో సమీక్ష

- వస్త్ర పరిశ్రమల వివరాలను తెలుసుకున్న కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 19: సిరిసిల్ల ప్రాంతంలో ఉన్న వస్త్ర పరిశ్రమతోపాటు టెక్స్‌టైల్, అపెరల్ పార్కులతోపాటు ఇతర పరిశ్రమల వివరాలను సంబంధిత చేనేత జౌళి శాఖ అధికారులను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అడిగి తెలుసు కున్నారు. కలెక్టరేట్‌లో బుధవారం చేనేత జౌళి శాఖ ఆర్‌డీడీ అశోక్‌రావు, ఏడీ మిట్టకోల సాగర్, ఇతర అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత జౌళి శాఖల పరిధిలో ఉన్న పరిశ్రమలపై అధికారులు పవర్ పాయి ంట్ ప్రజంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో మరమగ్గాల పరిశ్రమలు ఎన్ని ఉన్నాయి? ఎంతమంది మరమగ్గాల కార్మికులు పనిచేస్తున్నారు? ఈ పరిశ్రమ ద్వారా ఎంతమంది ఉపాధి పొందుతున్నారు? అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో టీఎస్‌ఐఐసీ జోనల్ మేనేజర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో ఉచిత వైద్య శిబిరం



పరీక్షలు చేయించుకుంటున్న ఈవో రామకృష్ణ

వేములవాడ టౌన్, జూన్ 19 : వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఈవో రామకృష్ణ ప్రారంభించారు. కరీంనగర్‌కు చెందిన ఓ ప్రైవేటు హాస్పిటల్ నిర్వాహకులు ఆలయ ఉద్యోగులకు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయ ఈవో రామకృష్ణతోపాటు ఆలయ ఉద్యోగులు ఉచిత వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

కోచింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలి

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 19 : తెలంగాణ ప్రభుత్వం ఆధ్వ ర్యంలో సివిల్ సర్వీసెస్ లాంగ్ టర్మ్ పరీక్ష 2025 శిక్షణ తర గతులను జూలై 18నుంచి ప్రారంభంకానున్నాయని, అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని సిరిసిల్ల బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలి పారు. 150 మంది అభ్యర్థులకు హైదరాబాద్‌లో కోచింగ్ ఇచ్చి నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని సైదాబాద్ లక్ష్మీనగర్ కాలనీలో ఉన్న టీజీ బీసీ స్టడీ సర్కిల్‌లో ఇవ్వనున్న కోచింగ్‌కు వంద మందిగాను జూలై 7న ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్‌ద్వారా ప్రతి భావంతులైన అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. జూలై 3వ తేదీ నుంచి హైదరాబాద్ సైదాబాద్ లక్ష్మీనగర్ కాలనీలోని టీజీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో సంప్రదిం చాలని కోరారు.

కస్తూర్బాలో యూనిఫాం పంపిణీ

కోనరావుపేట, జూన్ 19 : కోననరావుపేట మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో బుధవారం విద్యార్థినులకు యూనిఫాం అందజేశారు. ఈ సందర్భంగా కస్తూర్బా పాఠశాల స్పెషల్ అధికారి ఇందిర మాట్లాడారు. కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ దేవరకొండచారి, పర్శరాములు తదితరులు ఉన్నారు.

రామానుజమ్మకు ప్రభుత్వ విప్ అభినందన



అభినందిస్తున్న ఆది శ్రీనివాస్

సిరిసిల్ల టౌన్, జూన్ 19:మాస్టర్ అథ్లెట్స్‌లో జాతీయ, అంత ర్జాతీయ పోటీల్లో రాణిస్తున్న టమ టం రామానుజమ్మను బుధవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అభినం దించారు. భారత మాస్టర్స్ అథ్లెటిక్స్ అసో సియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల ఆయోధ్యలో నిర్వహించిన 1వ ఇంట ర్నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపి యన్‌షిప్ - 2024 పోటీలో 70 వయస్సు గ్రూప్‌లో సిరి సిల్ల పట్టణంకు చెందిన రామానుజమ్మ 1500 మీటర్లు, 800 మీటర్లు పరుగు పందెంలో బంగారు పతకం, 200 మీటర్ల పరుగు పందెంలో రజత పతకం అందుకుంది. అంతర్జాతీయ స్థాయిలో పతకాలను అందుకున్న రామానజమ్మ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను మర్యాద పూర్వకంగా అభినందించారు.

కలెక్టర్‌ను కలిసిన ప్రజాప్రతినిధులు, నాయకులు







పుష్పగుచ్ఛం అందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ అరుణ దంపతులు, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ చైర్ పర్సన్లు, కౌన్సిలర్లు

సిరిసిల్ల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్‌గా వచ్చిన సందీప్‌కుమార్ ఝాను బుధవారం కలెక్టరేట్‌లో జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ - రాఘవరెడ్డి దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని పలు సమస్యలను ప్రస్తావించారు.

●కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సందీప్ కుమార్ ఝాను బుధవారం కలెక్టరేట్‌లో సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పాలకవర్గాలు, అధికారులు, బీఆర్‌ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి, వైస్‌చైర్మన్‌మంచె శ్రీనివాస్, కమిషనర్ లావణ్య, కౌన్సిలర్లు, సెస్ డైరెక్టర్లు కలెక్టర్‌ను సన్మానించి జ్ఞాపికను అందజేశారు. వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, కౌన్సిలర్లు కలిశారు. అనంతరం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, స్థానిక సంస్థల కలెక్టర్‌లు పూజారి గౌతమి కౌన్సిలర్లతో సమావేశమై పలు అంశాలను చర్చించారు. జిల్లా అధికారులు, వివిధ సంస్థల ప్రతినిధులు కలెక్టర్‌ను కలిశారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట అగయ్య, టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, అర్బన్ బ్యాంక్ వైస్ చైర్మన్ అడ్డగట్ల మురళి కలెక్టర్‌ను కలిశారు.

రంగరాయిని చెరువు

ఆక్రమణపై విచారణ

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



చెరువును పరిశీలిస్తున్న అధికారులు

కోనరావుపేట, జూన్ 19: మండలంలోని వట్టిమల్ల కమ్మరిపేట తండా శివారులో రంగరాయిని చెరువును ఇరిగేషన్ అధికారులు బుధవారం పరిశీలించారు. ఈనెల 17న 'రంగరాయిని చెరువు ఆక్రమణ' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. చెరువును ఆక్రమించుకున్న వారి వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.సర్వే చేసి హద్దులను ఏర్పాటు చేస్తామని, అనంతరం ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ ఏఈ సాగర్ తెలిపారు. చెరువు ఆయకట్టు 150 ఎకరాల వరకు ఉంటుందని, చెరువు నిండితే ఆయకట్ట భూములు సస్యశ్యామలం అవుతాయని రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంట వర్క్ ఇన్‌స్పెక్టర్ బాలయ్య, కమ్మరిపేట తండావాసులు ఉన్నారు.

పెంటి వాగుపై తాత్కాలిక మరమ్మతు



వాడుపై మరమ్మతు పనులు

కోనరావుపేట, జూన్ 19: కోనరావుపేట మం డలంలోని పెంటివాగు బ్రిడ్జి వద్ద ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు అధికారులు బుధ వారం తాత్కాలిక మరమ్మతు చేపట్టారు. పెంటి వాగు బ్రిడ్జి వరద తాకిడికి కొట్టుకుపోయింది. ఆర్టీసీ బస్సు వెళ్లడానికి వీలు లేకుండా పోయింది. ఆర్టీసీ బస్సు నడవక పోవడంతో కోనరావుపేట ప్రజలు సమస్యను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన తాత్కాలిక మరమ్మతు చేయించారు.

రాష్ట్రం సహకరిస్తే నిధులు తీసుకొస్తా

- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్



బండి సంజయ్‌కి స్వాగతం పలుకుతున్న అధికారులు,అర్చకులు

సిరిసిల్ల, (ఆంధ్రజ్యోతి)/వేములవాడ టౌన్, జూన్ 19: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తనకు సహకరిస్తే కేంద్రం నించి రాజన్న ఆలయానికి నిధులు తీసు కొస్తానని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం వేములవాడ రాజరాజేశ్వరస్వామి దర్శనానికి వచ్చిన ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. తనను 40 వేలపైగా మెజార్టీ ఇచ్చి తన గెలుపునకు కృషి చేసిన వేములవాడ గడ్డను ఎప్పటికీ మరిచిపోనన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ రాజన్న ఆల యానికి రావడం దేశ వ్యాప్తంగా చర్చ జరిగిందన్నారు. పేదల దేవుడిగా విరాజిల్లుతున్న రాజన్న ఎంతో గొప్పవాడని, రాజన్న ఆలయాన్ని రూ. 400 కోట్లతో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చి, రాజన్నకే శఠగోపం పెట్టిన బీఆర్‌ఎస్ పార్టీని కనుమరుగయ్యేలా చేసి కేసీఆర్ కుటుంబానికి రాజన్న పవరంటే ఎంటో చూపాడని అన్నారు. రాజన్న మాములు దేవుడు కాదని, మంచికి మంచి, చెడుకు చెడు, ధర్మద్రోహులు ఎవరు అనేది రాజన్నకు పూర్తిగా తెలుసునని అలాంటి వారికి గుణపాఠం ఎలా చెప్పాలో రాజన్నకు తెలుసునని అన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రాజన్న ఆలయ అభివృద్ధి చేయలేదని, ప్రసాద్ స్కీంతో తాను చేస్తానని పలుమార్లు లేఖ రాసినా చేయనివ్వలేదని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై తనకు పూర్తిగా నమ్మకం ఉందని, అప్పుడు, ఇప్పుడు ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తనకు సహకరిస్తే కేంద్రం నుంచి రాజన్న ఆలయానికి నిధులు తీసుకొస్తానని, ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు చెన్నమనేని దీపవికాస్‌రావు, ఎర్రం మహేష్, రేగుల మల్లికార్జున్, గోపు బాలరాజు, బండ మల్లేశం యాదవ్, జక్కుల తిరుపతి తదితరులు ఉన్నారు.

● కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టి మొదటిసారిగా వేములవాడకు వచ్చిన బండి సంజయ్‌కు బీజేపీ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. బీజేపీ నేత చెన్నమనేని దీప వికాస్‌రావు ఆధ్వర్యంలో రూరల్ వైస్ ఎంపీపీ జక్కుల కవితతిరుపతి ఆధ్వర్యంలో ఫాజుల్‌నగర్‌లో భారీ గజమాల వేశారు. వేములవాడ పట్టణ బీజేపీ నాయకులు ఎర్రం మహేష్, రేగుల మల్లికార్జున్, బండ మల్లేశం యాదవ్, గోపు బాలరాజులు, రేగుల సంతోష్‌బాబు శాత్రాజుపల్లిలో స్వాగతం పలికారు.

● రాజన్న ఆలయానికి వచ్చిన బండి సంజయ్‌కి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్‌మహాజన్, అడిషనల్ కలెక్టర్‌లు ఖీమ్యానాయక్, పూజారి గౌతమి స్వాగతం పలికారు. పోలీస్‌లు ఏర్పాటు చేసిన గౌరవ వందనాన్ని నిర్వహించారు. ఆర్డీవో రాజేశ్వర్, డీఎస్పీ నాగేంద్రచారి ఉన్నారు.

రాజన్న సేవలో బండి సంజయ్..

రాజన్న ఆలయానికి వచ్చిన బండి సంజయ్‌కుమార్‌కు ఆలయ ఈవో రామకృష్ణ పూజలమొక్కును అందించి స్వాగతం పలికారు. ఆలయ ప్రోటోకాల్ పీఆర్వో సిరిగిరి శ్రీరాములు ఆధ్వర్యంలో అర్చకులు పూలమాలతో స్వాగతం పలికారు. ముందుగా కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనంతరం రాజన్న సేవలో పాల్గొన్నారు. మంత్రికి ఆలయ అర్చకులు ఆశీర్వచనం, ఈవో స్వామి వారి శేషవస్త్రాలను, ప్రసాదాన్ని అందజేశారు.



స్వాగతం పలుకుతున్న కలెక్టర్

● మార్కండేయ స్వామి సన్నిధిలో..

కేంద్ర సహాయ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తరువాత బండి సంజయ్ తొలిసారిగా జిల్లాకు రావడంతో బీజేపీ శ్రేణులు, అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. వేములవాడ నుంచి సిరిసిల్లకు చేరుకున్న బండి సంజయ్‌కి చేనేత విగ్రహం వద్ద బీజేపీ నాయకులు స్వాగతించారు. అక్కడి నుంచి మార్కండేయ దేవస్థానానికి చేరుకున్నారు. వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతించారు. మార్కండేయ స్వామికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం పద్మశాలి సంఘం పక్షాన సన్మానాలు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి, పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, కార్యదర్శి మండల సత్యం, మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రాణీరుద్రమరెడ్డి, పద్మశాలి మహిళా సంఘం అధ్యక్షురాలు కాముని వనిత, యువజన సంఘం అధ్యక్షుడు గుండ్లపల్లి పూర్ణచందర్, పద్మశాలి భవన్ అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీనివాస్, గాజుల బాలయ్య, గుజ్జె తార, తాటిపాముల దామోదర్, పిస్క మధు, బీజేపీ పట్టణ అధ్యక్షుగు నాగుల శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, నియోజకవర్గ ఇంచార్జ్ మల్లారెడ్డి, బీజేపీ నాయకులు పత్తిపాక సురేష్ శీలం రాజు, అన్నల్‌దాస్ వేణు, దుమాల శ్రీకాంత్, బోల్గం నాగరాజుగౌడ్, గూడూరి బాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



మార్కండేయస్వామికి పూజలు చేస్తున్న బండి సంజయ్

నీటి సంఘాలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలి

కరీంనగర్ టౌన్, జూన్ 19: వంద ఎకరాల ఆయకట్టు ఉన్న నీటి సంఘాల కు గతంలో టీడీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎన్నికలు నిర్వహించగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించలేదని నీటి సంఘాల ఫోరం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బీరెడ్డి కరుణాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 1997లో టీడీపీ ప్రభుత్వం నీటి సంఘాలను ఏర్పాటు చేసి రెండేళ్లకోసారి ఎన్నికలు నిర్వహించారన్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కాలపరిమితిని మూడేళ్లకు పెంచిందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం లోకి వచ్చినందున నీటి సంఘాలకు వెంటనే ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

గోపాల్‌రావుపేటలో ఏసీపీ విచారణ

రామడగు, జూన్ 19: రామడుగు మండలం గోపాల్‌రావుపేటలో ఏసీపీ విచారణ చేపట్టారు. ఈసందర్భంగా బుడగ జంగాల యువకులను కులం పేరుతో గౌడ కులస్తులు దూషించారని ఫిర్యాదు చేయడంతో ఏసీపీ విచారణ జరిపారు. ఆయన వెంట రామడుగు ఎస్ఐ సురేందర్, తదితరులు ఉన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు



నిందితుల అరెస్ట్ చూపుతున్న సీఐ సురేష్ బాబు

కోరుట్ల, జూన్ 19: కోరుట్ల మండలం మోహన్‌రావుపేట గ్రామానికి చెందిన కోట రాజేష్ హత్య కేసులో ఎనిమిది మంది నిదుతులను అరెస్టు చేసినట్లు కోరుట్ల సీఐ సురుష్ బాబు బుధవారం తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కేసు సంబదించిన వివరాలను సీఐ సురేష్ బాబు, ఎస్ఐ కిరణ్ కుమార్‌తో వెల్లిడించారు. రాజేష్ తన తమ్ముడు రాకేష్‌తో పాటు కుటంబ సభ్యులకు గ్రామంలో అస్తి తగాద ఉంది. రాజేష్ వివాదంలో ఉన్న భూమిలో కోన్ని రోజుల క్రితం బాత్ రూంలు కట్టడంతో మరింత వివాదం ముదిరింది. విషయంపై కుటుంబసభ్యులు, తమ్ముడు రాకేష్ తన మిత్రుడు లింగపల్లి నరేష్ రాజేష్‌ను ప్రశ్నించారు. దీంతో ఘర్షణ చోటుచేసుకోగా రాజేష్‌పై తమ్ముడు రాకేష్ కత్తితోదాడి చేశారు. అలాగే స్నేహితుడు లింగంపల్లి నరేష్ తండ్రి గంగారాజం, భార్య కోట మాసన, అతని చిన్నమ్మలు కోట మల్లు, మంచాల లక్ష్మి, బాబాయిలు కోట గంగారాజం, మాంచాల రాజేశం దాడి చేసినట్లు గుర్తించి రాజేష్ భార్య లాస్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. నిందితులు మోహరావుపేట, మేడిపల్లి మండలం వల్లంపల్లి గ్రామాల్లో ఉన్నట్లు సమాచా రం అందగా అక్కడి వెళ్లి వారిని కోరుట్ల ఎస్ఐ కిరణ్‌కుమార్ అరెస్టు చేసి కోరుట్ల పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్ల సీఐ తెలిపారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసు సిబ్బందిని సీఐ అభినందించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

సారంగాపూర్, జూన్ 19: అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టరు యజమాని, డ్రైవర్‌పై పోలీసులు బుధవారం కేసు నమోదు చేసి ట్రాక్టరును సీజ్ చేశారు. ఎస్సై దత్తాద్రి తెలిపిన వివరాల ప్రకారం ఆరెపల్లి నుంచి జగిత్యాలకు అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా సారంగాపూర్ అటవీ ప్రాంతంలో పోలీసులు పట్టుకుని ట్రాక్టరును స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు. ఆరెపల్లికి చెందిన దర్శనాల సిద్దు, పిస్క వెంకటేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మణికంఠరెడ్డి

జమ్మికుంట రూరల్, జూన్ 19: రాష్ట్రంలో ప్రభుత్వం విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కారించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి అన్నారు. పట్టణంలో ఏర్పాటు చేసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకారవేతనాల బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థులకు అండగా ఉండాలని అన్నారు. ప్రైవేటు విద్యా సంస్థలు ఫీజుల దోపిడీ చేస్తున్నాయని మండిపడ్డారు. నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని నీట్ పరీక్ష రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామరావు వెంకటేష్, నాయకులు అలువాల విష్ణు, అనిల్ కుమార్, తౌకిర్ అనిల్ రెడ్డి, సాయి, వంశీ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డు పొగతో ఇక్కట్లు


మెట్‌పల్లిలోని డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న పొగ

ఉక్కిరిబిక్కిరి అవుతున్న రైతులు

మెట్‌పల్లి, జూన్ 19: మెట్‌పల్లి పాలక సంఘం పరిధిలోని పట్టణ శివారు డంపింగ్ యార్డు నుంచి వస్తున్న పొగలతో జనం తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. పట్టణం శివారులోని గోదూరు రోడ్డులోని డంపింగ్‌యార్డుతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. డంపింగ్‌కు సమీపంలోని వ్యవసాయ పొలాలలో పనిచేసే రైతులకు కుళ్లిపోయిన చెత్తతో దుర్వాసన వెదజల్లుతోందంటున్నారు. డంపింగ్ యార్డులోని చెత్తకు సిబ్బంది మంట పెట్టి వెళ్లిపోతున్నారు. దీంతో అక్కడ అప్పుడప్పుడు మంటలు ఎగిసిపడుతున్నాయి. పలుమార్లు సిబ్బందికి సూచించినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గాలి ఎక్కువగా వీస్తున్న సమయంలో ఈ దట్టమైన పొగలు ఆప్రాంతమంతా కమ్ముకొని పొలాల్లో పని చేసే రైతులు, కూలీలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంట పొలాలకు దగ్గర డంపింగ్ యార్డు ఏర్పాటు చేసిన దానిలో రోజు పట్టణంలో సేకరించిన చెత్తను అక్కడ వేయడం వలన పొలాల్లో పని చేసే రైతులకు దుర్వాసన వస్తుండటంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పొలాలకు వెళ్లే రోడ్లపై ఎక్కడపడితే అక్కడ చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. దీంతో ఏమిచేయాలో తెలియక ప్రజలు, రైతులు ముక్కులోనుంచి పొలాలకు వెళ్తున్నారు. బుధవారం డంపింగ్ యార్డుకు నిప్పంటించడంతో రైతులు, వాహనదారులు ఉక్కిరిబిక్కిరయ్యారు. చెత్తకు నిప్పంటిస్తుండడం తో ఆ ప్రాంతమం తా దట్టమైన పొగలు నిండుకుని సమీపంలోని రైతులు, వాహనదారులు పీల్చుకోవడం వల్ల దగ్గు, ఊపిరితిత్తుల సమస్యలు వస్తున్నాయంటున్నారు. సమస్యను మున్సిపల్ అధికారుల అధికారుల దృష్టికి తీసుకెళ్లినా మంటలు ఆర్పుతామంటారే కానీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు పరిశీలించి సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ముగ్గురు అదృశ్యం?

● లబోదిబోమంటున్న బాధితులు

హుజూరాబాద్, జూన్ 19: హుజూరాబాద్‌లో నెలరోజుల్లో ముగ్గురు వ్యక్తులు ఆర్థిక ఇబ్బందులతో అదృశ్యం కావడంతో డబ్బులు ఇచ్చిన బాధితులు లబోదిబోమంటున్నారు. హుజూరాబాద్ పట్టణంలో గత 20ఏళ్లగా ఓ వ్యక్తి రాజకీయంలో ఉంటూ ఫైనాన్స్, చిట్టీల వ్యాపారం నిర్వహించాడు. ఇతనిని నమ్మిన కొంత మంది చిట్టీలు వేయగా, వడ్డీ వస్తుందనే ఉద్దేశ్యంతో దాచుకున్న డబ్బులను సుమారు రూ. కోటి వరకు ఇచ్చారు. ఆ వ్యక్తి ఇటీవల భార్య పిల్లలతో కనబడకుండా పోయాడు. ఇదిలా ఉండగా, పట్టణంలోని కర్నాటకు చెందిన ఓ బేకరి యజమాని కొంత మంది దగ్గర సుమారు రూ. 20లక్షల వరకు అప్పుచేసి కుటుంబంతో పారిపోయాడు. అతని కోసం బాధితులు కర్నాటకకు కూడా వెళ్లి వచ్చినట్లు సమాచారం. అలాగే పట్టణంలోని ఓ రిటైర్డ్ ఉద్యోగి కొడుకు వ్యాపారం చేసి అప్పులు కావడంతో, తెలుసుకున్న తండ్రి నెల రోజులుగా కనబడకుండా పోవడంతో కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పైముగ్గురు వ్యక్తులది ఆర్థిక వ్యవహారాల కారణం కావడంతో హుజూరాబాద్ పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

బీసీస్టడీ సర్కిల్‌లో గ్రూప్-2 అభ్యర్థులకు గ్రాండ్ టెస్ట్‌లు

గణేశ్‌నగర్,జూన్ 19: తెలంగాణ ప్రభుత్వం నిర్వహించే గ్రూప్-2 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్ -2 గ్రాండ్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నట్టు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల ఉమ్మడి కరీంనగర్ జిల్లా అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా www.tgbcstudycircle.cgg.gov.in వెబ్‌సైట్‌లో జూలై 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పరీక్షలు కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్‌లో జూలై 8,9,15,16,22,23,30,31, తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి 12:30 వరకు అలాగే, మధ్యాహ్నం 1:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు టెస్టులను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 0878-2268686 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

యువతకు ఉపాధి కల్పించే దిశగా ప్రత్యేక కార్యాచరణ

- మంథనిలో కోకోకోలా ప్లాంట్ - మినీ ఐటీ సెంటర్‌ను ఏర్పాటుకు కృషి - రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

మంథని, జూన్19: మంథని నియోకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడానికి మంథని ప్రాంతంలో కోకోకోలా కంపెనీ ప్లాంట్‌ను ఏర్పాటు చర్యలు తీసుకున్నట్లు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బా బు వెల్లడించారు. స్థానిక జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత బాలుర పాఠశాలలో బుధవారం నిర్వహించిన బడిబాట ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ఆమెరికా పర్యటనలో కోకోకోలా కంపెనీ ప్రతినిధులను కలిసి రాష్ట్రంలో పరిశ్రమ స్థాపనకు ముందుకు రావాలని కోరగా వారు తమ ప్లాట్‌ను మంథనిలో ఏర్పాటు చేయటానికి హామీ ఇచ్చారన్నారు. కోకోకోలా ప్లాంట్‌ను ఏర్పాటు చేయటానికి మంథని మండలంలోని అడవిసోమన్‌పల్లి, సిరిపురం తోపాటు పెద్దపల్లి జిల్లాలోని మరో రెండు ప్రాంతాలను కంపెనీ ప్రతినిధులు తమకు అనువైన స్థలం కోసం పరిశీలిస్తున్నారన్నారు. త్వరలోనే ప్లాంట్‌ను ఏర్పాటు చేయించి మంథని ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తామన్నారు. మంథని-శివ్వారం మధ్య గోదావరినదిపై రూ. 120 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం చేపడుతామన్నారు. మరో పదిహేను రోజుల్లో సంబంధిత శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో గోదావరినదిపై బ్రిడ్జి నిర్మాణం పనులకు శంకుస్థాపన చేయిస్తామన్నారు. బ్రిడ్జి నిర్మాణంతో మంచిర్యాల-పెద్దపల్లి జిల్లా అనుసంధానంతో ప్రజలకు రవాణా వ్యవస్థ మెరుగుపడుతుందన్నారు. మంథనిలో ఒక చిన్న ఐటీ సంస్థ సైతం అతి త్వరలో ఏర్పాటు కాబోతుందని, తొలి విడితలో 50 మంది యువతకు నెలరోజుల లోపు ఉపాధి కల్పుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక అవసరాలు కల్పించే దిశగా ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకున్నామన్నారు. పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందన్నారు. పెద్దపల్లి జిల్లాలో రూ.30 కోట్లతో 478 పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకోసం చర్యలు తీసుకుంటున్నామన్నారు. మహిళా సాధికారత మాటలకే పరిమితం కాకుండా చేతలు కూడా ఉండాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. అందులో భాగంగా ఆర్టిసి బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం, మహిళా సంఘాల సభ్యులతో ఏర్పాటు చేసిన అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ, మౌలిక వసతుల కల్పన బాధ్యతలు అప్పగించామన్నారు.

మార్కెట్‌లో వచ్చే కొత్త కోర్సులు, ట్రెండ్స్ నైపుణ్యాలు విద్యార్థులకు అందించడం కోసం ఐటీఐలను ఆధునీకరిస్తున్నామన్నారు. 65 అడ్వాన్స్ లెర్నింగ్ కేంద్రాలను దాదాపు 2,234 కోట్ల రూపాయలతో టాటా కంపెనీ సౌజన్యంతో ఏర్పాటు చేస్తున్నామన్నారు. కాటారం ఐటీఐలో ఆరు కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు ప్రారంభించామన్నారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పనతోపాటు ఉత్తీరణత శాతాన్ని పెంచడానికి నాణ్యమైన విద్యను ఉపాధ్యాయుల ద్వారా అందించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె అరుణశ్రీ, ఆర్డీవో హనుమానాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డి, ఎంపీపీ కొండ శంకర్, జడ్పీటీసీ తగరం సుమలత, సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, డీఈవో మాధవి, డీఆర్‌డీవో రవీందర్ రాథోడ్, పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్, పీఈటీ డాక్టర్ దొమ్మటి రవి పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

మేడిపల్లి, జూన్ 19: మండలంలోని దేశపేట గ్రామానికి చెందిన కురుమళ్ల సతీష్(31) ఆర్థిక ఇబ్బందులతో బుధవారం చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సతీష్ కొద్దిరోజుల క్రితం ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లాడు. అయితే అక్కడ ఉపాధి లభించకపోవడంతో ఏం చేయాలో తెలియక మనోవేదనకు గురయ్యాడు. మరోవైపు గల్ఫ్ వెళ్లేందుకు చేసిన అప్పులు పెరిగిపోయాయి. అప్పులు తీర్చే మార్గం కనిపించక తీవ్రమనస్తాపానికి గురైన సతీష్ జీవితంపై విరక్తి చెంది బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. సతీష్ భార్య ఫిర్యాదు మేరకు కేసుదర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్యాంరాజ్ తెలిపారు.

బావిలో మహిళ మృతదేహం లభ్యం

సుల్తానాబాద్, జూన్ 19: సుల్తానాబాద్ మండలంలోని నీరుకుళ్ల గ్రామంలో నిర్మల(38) అనే మహిళ మృతదేహం బావిలో బుధవారం లభ్యమైంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. నీరుకుళ్ల గ్రామానికి చెందిన నిర్మలకు చాలాకాలం నుంచి సంతానం కలుగలేదు. దాంతో అమె మానసికంగా అవేదన చెందుతోంది. కొన్ని రోజుల క్రితం ఆపరేషన్ కూడా జరగడంతో ఇంకా మానసికంగా కుంగిపోయింది. బుధవారం ఉదయం నుంచి తన భార్య కనిపించకుండా పోవడంతో భర్త ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అంతటా వెతికారు. ఎక్కడా ఆచూకీ లభ్యం కాలేదు. మధ్యాహ్నం ఇంటి సమీపంలోని వ్యవసాయ బావిలో నిర్మల మృతదేహం లభ్యమైంది. నిర్మల మృతిపై బంధువులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

రేపు సంగీత విభావరి

కరీంనగర్ కల్చరల్, జూన్ 19: ప్రపంచ సంగీత దినోత్సవం సందర్భంగా నగరంలోని ఫిలింభవన్‌లో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రవీణ్ సల్వాజి మ్యూజికల్ గ్రూప్, సల్వాజి ఈవెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 10 జిల్లాల కళాకారుల సంగీత విభావరి ఏర్పాటు చేసినట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సల్వాజి ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలిపారు. సంగీత విద్వాంసులకు, గురువులకు సన్మానం ఉంటుందని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కళాకారులు, కళాభిమానులు, కళా పోషకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పురుడు పోసిన ఆర్టీసీ సిబ్బందికి సన్మానం


ఆర్టీసీ సిబ్బందిని సన్మానిస్తున్న ఎండీ సజ్జనార్

భగత్‌నగర్, జూన్19: కరీంనగర్ బస్‌స్టేషన్‌లో మహిళకు పురుడు పోసిన ఆర్టీసీ సిబ్బందిని బుధవారం హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో ఆర్టీసీ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ విసి సజ్జనార్ సత్కరించారు. ఈనెల 16 ఆదివారం ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో ఒడిశా రాష్ట్రానికి చెందిన గర్భిణి కుమారికి పురిటి నొప్పులు రాగా ఆర్టీసీ సిబ్బంది బస్‌స్టేషన్‌లో పురుడు పోశారు. బస్‌స్టేషన్‌లో మహిళ ప్రసవానికి సహకరించి పురుడు పోసిన ఆర్టీసీ సిబ్బంది సైదమ్మ, రేణుక, భవాణి, లావణ్య, బస్‌స్టేషన్ ట్రాఫిక్‌మేనేజర్ రజనీకృష్ణ, స్టేషన్ మేనేజర్ నోముల అంజయ్యను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ వి రవీందర్, జాయింట్ డైరెక్టర్ (విజిలెన్స్) అపూర్వరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) పివి మునిశేఖర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (అడ్మినిస్ట్రేషన్) ఎస్‌కృష్ణకాంత్, చీఫ్ పర్సనల్ మేనేజర్ ఉషాదేవి తదితరులు పాల్గొన్నారు.

● **చిన్నారికి ఆర్టీసీ జీవితకాలపు ఉచిత బస్‌పాస్**

ఈనెల 16న ఆదివారం కరీంనగర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బస్‌స్టేషన్‌లో జన్మించిన చిన్నారికి ఆర్టీసీ జీవితకాలపు ఉచిత బస్ పాస్‌ను సంస్థ ప్రకటించింది. గతంలో ఆర్టీసీ బస్సులు, బస్‌స్టేషన్‌లో పుట్టిన పిల్లలకు జీవితకాలపు ఉచిత బస్‌పాస్ ఇవ్వాలనే యాజమాన్యం తీసుకున్న నిర్ణయం మేరకు ఆదివారం కరీంనగర్ బస్‌స్టేషన్‌లో జన్మించిన ఆడపిల్లకు బర్త్‌డే గిఫ్ట్‌గా ఉచిత బస్‌పాస్‌ను మంజూరు చేస్తున్నట్లు సంస్థ యాజమాన్యం తెలిపింది.

జీపీఎఫ్ ఖాతాల్లోని నిధుల మాయంపై విచారణ


రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

జగిత్యాల టౌన్, జూన్ 19 : జగిత్యాల జిల్లా వైద్య విధాన పరిషత్‌లో పనిచేసే ఉద్యోగుల జీపీఎఫ్ ఖాతాల్లోని నిధులు మాయంపై బుధవారం నిజామాబాద్ జిల్లా బాన్స్‌వాడ ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ ప్రసాద్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆసుపత్రి ఆవరణలో ఉన్న వైద్య విధాన పరిషత్ కార్యాలయంలో బుధవారం రోజంతా విచారణ కొనసాగింది. రికార్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న యాసిన్ అనే ఉద్యోగి వైద్య విధాన పరిషత్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల డీఏ ఏరియర్స్, సీపీఎస్ ఏరియర్స్, వివిధ డిడెక్షన్లకు సంబంధించిన నిధులను వారి ఖాతాల్లో జమ చేయకుండా సుమారు రూ.50 లక్షలకు పైగా పక్కదారి పట్టించగా విచారణలో నిజమని తేలడంతో యాసిన్‌ను సస్పెండ్ చేశారు. దీంతో బుధవారం బాన్స్‌వాడ ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ ప్రసాద్ ఆధ్వర్యంలో పూర్తి స్థాయిలో విచారణ చేపట్టారు. వైద్య విధాన పరిషత్ ఖాతాకు సంబంధించి జారీ చేసిన ఓచర్లు, చెక్కులు తదితర రికార్డులను హైదరాబాద్ నుంచి వచ్చిన ఇద్దరు ఆడిటర్స్ పరిశీలించారు. యాసిన్ మూడు చెక్కులకు సంబంధించిన ఓచర్లను మాయం చేసినట్లు గుర్తించారు. దారి మళ్లించిన నిధుల నుంచి రూ. 40 లక్షలను ఖాతాలోకి జమ చేయించారు. మిగతా నిధులు రికవరితో పాటు రెండు, మూడు సంవత్సరాల లావాదేవీలకు సంబంధించిన ఓచర్లను ఆడిటర్స్ పరిశీలిస్తున్నట్లు విచారణ అధికారి వివరించారు.

● **బయట పడుతున్న రికార్డ్ అసిస్టెంట్ బాగోతం...**

జగిత్యాల వైద్యవిధాన పరిషత్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు సంబంధించి డీఏ ఏరియర్స్, సీపీఎస్ ఏరియర్స్ నిధులు పక్కదారి పట్టించిన రికార్డు అసిస్టెంట్ యాసిన్ అవినీతి బాగోతం బుధవారం మరిన్ని వెలుగులోకి వచ్చాయి. జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో 11 సంవత్సరాల నుంచి పనిచేస్తున్న బాబర్ అనే వ్యక్తిని నమ్మించి పర్సనల్ లోన్ ఇప్పిస్తానని చెప్పి ఐదు లక్షల రూపాయలు, థియేటర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శివ గంగాధర్ అనే వ్యక్తి వద్ద పర్సనల్ లోన్ ఇప్పిస్తానని 15 లక్షల రూపాయలు తీసకుని మోసాలకు గురిచేసినట్లు బాధితులు విచారణ అధికారికి ఫిర్యాదు చేశారు. యాసిన్ నుంచి డబ్బులు రికవరీ చేయించాలని వేడుకున్నారు. ఇలా యాసిన్ బాగోతాలు ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నాయి.

రేణుకాదేవి ఉత్సవాల్లో జడ్పీ చైర్ పర్సన్



జడ్పీ చైర్ పర్సన్ పూజలు

ఇల్లంతకుంట, జూన్ 19: మండలంలోని కందికట్కూర్ గ్రామంలో ప్రారంభమైన రేణుకా దేవి ఉత్సవాలకు జడ్పీచైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ బుధవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు బాగుండాలని కోరుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీవైస్ చైర్మన్ సిద్దం వేణు, ఏఎంసీ మాజీ చైర్మన్ చింతపల్లి వేణురావు, తూటి పర్శరాం తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదాతలుగా నిలవాలి



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే

ఇల్లంతకుంట, జూన్ 19: రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని కందికట్కూర్, గాలిపెల్లి గ్రామాలలో జరుగుతున్న రేణుకాదేవి ఉత్సవాలకు హాజరయ్యారు. తొలుత కందికట్కూర్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు రక్తదానం చేయడం అలవాటుగా మార్చుకోవాలన్నారు. సకాలంలో వర్షాలు కురిసి, పంటలు సమృద్ధిగా పండాలని రేణుకాదేవిని వేడుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రమణారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూంపెల్లి రాఘవరెడ్డి, ఎంపీటీసీ దొమ్మాటి కిషోర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టెక్స్‌టైల్ పార్కు అసోసియేషన్ ఎన్నిక



ఎన్నికైన టెక్స్‌టైల్ పార్కు కార్యవర్గం

సిరిసిల్ల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్కు అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం సిరిసిల్లలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా అన్నల్‌దాస్ అనిల్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా వేముల శ్రీనివాస్, కార్యదర్శిగా అంకారపు కిరణ్, కోశాధికారిగా యెల్లె లక్ష్మీనారాయణ, సహాయ కార్యదర్శిగా కట్టెకోల శివశంకర్ ఎన్నికయ్యారు.

గంభీరావుపేట జూనియర్ అసిస్టెంట్, బిల్ కలెక్టర్ సస్పెన్షన్

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 19: గంభీరావుపేట జూనియర్ అసిస్టెంట్‌తో పాటు బిల్ కలెక్టర్‌లను సస్పెండ్ చేస్తూ బుధవారం సాయంత్రం జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శిరీషా గ్రామంలో వసూలు చేసిన ఇంటి పన్ను రూ.12 లక్షల 93 వేల 921 రూపాయలను ట్రెజరీలో జమ చేయకుండా దుర్వినియోగం చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు బిల్ కలెక్టర్ శ్రీహరి గ్రామంలో వసూలు చేసిన ఇంటి పన్నులు రూ.2 లక్షల 40 వేల 100ను ట్రెజరీలో జమ చేయకుండా దుర్వినియోగానికి పాల్పడడంతో మండల పంచాయతీ అధికారి విచారణ నివేదిక ప్రకారం ఇద్దరిని సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

శాంతి దీక్షకు ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలు

వేములవాడ టౌన్, జూన్ 19 : హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ సమీపంలో ధర్నా చౌక్ వద్ద ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యం సభ్యులు ఏర్పాటు చేసిన శాంతి దీక్షకు వేములవాడకు చెందిన ప్రైవేటు కళాశాల నిర్వాహకులు బుధవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా వేములవాడ నందికమాన్ సమీపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు డిగ్రీ, పీజీ కాళాశాలలకు ప్రభుత్వం నుంచి సుమారు రూ.1800 కోట్ల రీయింబర్స్‌మెంట్ బకాయిలు రావాల్సి ఉన్నాయన్నారు. టోకెన్లు ఇచ్చినా రెండేళ్లుగా నిధులు విడుదల చేయడం లేదన్నారు. కళాశాల నిర్వహణ ఇబ్బందికరంగా మారిందని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆయాచితుల జితేందర్‌రావు, శేఖర్‌రెడ్డి ఉన్నారు.

విద్యా శాఖ మంత్రిని నియమించాలి

ఎల్లారెడ్డిపేట, జూన్ 19: విద్యా శాఖ మంత్రిని నియమించాలని బీజేవైఎం జాతీయ కార్యాలయ కో-ఆర్డినేటర్ అనూష్‌యాదవ్ ఫ్లకార్డుతో బుధవారం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలలు పునః ప్రారంభమైనా విద్య శాఖ మంత్రి లేకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వానికి మద్యంపై ఉన్న శ్రద్ధ విద్యపై లేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యా శాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో విద్యార్థుల పక్షాన ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు.

విద్యార్థినికి సన్మానం

వేములవాడ టౌన్, జూన్ 19 : వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యనభ్యసించిన దివ్య అనే విద్యార్థిని కళాశాల ప్రిన్సిపాల్ బుధవారం సన్మానించారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలో సీఈసీ చదవిన దివ్య 939 మార్క్‌లు సాధించింది. కోటిలోని మహిళా డిగ్రీ కళాశాలలో బీకాం కంప్యూటర్‌లో సీటు సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు అంజయ్య, శేఖర్, అశోక్, మహేందర్, గోపి లత, స్వప్న తదితరులు ఉన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

చందుర్తి, జూన్ 19 : చందుర్తి మండల కేంద్రానికి చెందిన పిట్టల మంజుల అనే మహిళ నెలరోజుల క్రితం ప్రమాదవశాత్తు బిల్డింగ్ పైనుంచి పడి తీవ్ర గాయాలై మంచానికి పరిమితమైంది. హనుమకొండకు చెందిన నుగునూరి చంద్రమోహన్ మిత్రుల సహకారంతో బుధవారం చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా నిత్యావసరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పులి సత్తయ్య, మహమ్మద్ ఆజీమ్, దారం రామచంద్రం పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాల సీజ్

ఇల్లంతకుంట, జూన్ 19: మండల కేంద్రంలోని కేరళమోడల్ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు విక్రయిస్తుండగా ఎంఈవో బన్నాజీ సీజ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు అమ్ముతున్నారని విద్యార్థి సంఘాల నాయకులు బుధవారం పాఠ్యపుస్తకాలు ఉన్న గోదాం వద్ద నిరసన తెలిపారు. ఉన్నత అధికారులకు పిర్యాదు చేశారు. అధికారుల ఆదేశాల మేరకు సీజ్ చేశారు. యువజన సంఘాల నాయకులు మామిడి రాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మంద అనిల్‌కుమార్, ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అక్కెం నాగరాజు పాల్గొన్నారు.

వృద్ధురాలి ఆచూకీ లభ్యం

ఎల్లారెడ్డిపేట, జూన్ 19: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఈ నెల 18న అదృశ్యమైన వృద్ధురాలు ఎనగందుల భూదవ్వ ఆచూకీ లభ్యమైందని పోలీసులు, కుటుంబ సభ్యులు బుధవారం తెలిపారు. ఈ నెల 18న భూదవ్వ ముస్తాబాద్ మండలం ఆవునూర్ గ్రామంలోని తన బంధువుల ఇంటికి వెళుతున్నానని కుటుంబ సభ్యులకు చెప్పి బయలుదేరింది. అదే రోజు రాత్రి బంధువులకు ఫోన్ చేయగా తమ వద్దకు రాలేదన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. దుబ్బాకలోని బంధువులు ఫోన్ చేసి తమ వద్దకు వచ్చిందని విషయం చెప్పారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

వేములవాడ టౌన్, జూన్ 19 : వేములవాడ పట్టణంలో కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్న మహారాష్ట్రకు చెందిన బాబురావు అనే వ్యక్తి గుండెపోటుతో బుధవారం మృతి చెందాడు. మృతదేహాన్ని తిరిగి మహారాష్ట్రలోని స్వగ్రామానికి తీసుకెళ్లేందుకు దారి ఖర్చులు కూడా లేవని బాధపడుతున్న బాధిత కుటుంబానికి 98 ఫ్రెండ్స్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు రూ.8 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ట్రస్ట్ సభ్యులను స్థానికులు అభినందించారు

బలహీనవర్గాల అభ్యున్నతికి రాహుల్ గాంధీ కృషి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



కేక్‌కట్ చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, జూన్ 19 : దేశ వ్యాప్తంగా ఉన్న పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి రాహుల్‌గాంధీ పాటుపడుతున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ పుట్టిన రోజు వేడుకలను బుధవారం రాజన్న ఆలయం ఎదుట ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ మతం, ప్రాంతం, భాషా పేరుతో దేశాన్ని విడదీయాలని చూస్తున్న బీజేపీని నిలువరించేందుకు పోరాటం చేస్తున్న యోధుడు రాహుల్‌గాంధీ అని అన్నారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, మణిపూర్ నుంచి ముంబాయి వరకు రాహుల్‌గాంధీ చేసిన భారత్ జోడో యాత్ర ప్రజలను కదిలించిందని గుర్తు చేశారు. దేశ వ్యాప్తంగా 400 సీట్లు రావాలని ఆశించిన బీజేపీని తక్కువ సంఖ్యకే పరిమితి చేసిన ఘనత రాహుల్‌గాంధీదేనన్నారు. బీజేపీకి సీట్ల సంఖ్యను తగ్గించి నైతికంగా విజయం సాధించిన రాహుల్‌గాంధీని త్వరలోనే దేశ ప్రధానికి చూస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో సోనియా గాంధీకి, రాహుల్‌గాంధీకి ప్రధాన మంత్రి అవకాశం వచ్చిన చేపట్టలేదన్నారు. దేశంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సాగరం వెంకటస్వామి, సంపు స్వామి యాదవ్, కౌన్సిలర్లు ఇప్పపూల అజయ్‌కుమార్, గూడూరి లక్ష్మీమధు, అన్నారం ఉమాశ్రీనివాస్, నాయకులు కనికరపు రాకేష్, చిలుక రమేష్, పుల్కం రాజు, పాత సత్యలక్ష్మి, తోట లహరి, రంగు వెంకటేష్, అరుణ్‌తేజా చారి, నాగుల విష్ణు, అక్కనపెల్లి నరేష్, దుర్గ పర్శరాములు పాల్గొన్నారు.

సిరిసిల్ల టౌన్: సిరిసిల్ల పట్టణం గాంధీచౌక్ వద్ద ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను బుధవారం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. టీపీసీసీ సభ్యుడు, నాగుల సత్యనారాయణ, కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు పాదయాత్ర చేసి వారి కష్టనష్టాలను తెలుసుకున్నారన్నారు. కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళా జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, పట్టణ అధ్యక్షురాలు వెల్మల స్వరూపతిరుపతిరెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి అరుణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరి చందన, పద్మశాలి సంఘం సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు గోలి వెంకటరమణ, రైతు బంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ బైరి ప్రభాకర్, మాజీ కౌన్సిలర్లు యెల్లె లక్ష్మీనారాయణ, ఆడెపు చంద్రకళ, రాగుల జగన్, నాయకులు వైద్య శివప్రసాద్, తాటికొండ శ్రీనివాస్, వెంగళ అశోక్, కోడం శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు గొల్లపల్లి గ్రామాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య మాట్లాడుతూ పేద ప్రజల కష్టాలను తెలుసుకునేందుకు రాహుల్ గాంధీ దేశ వ్యాప్తంగా 5 వేల కిలోమీటర్లు పాదయాత్ర చేశారన్నారు. దేశంలోనే ప్రజాదరణ కల్గిన వ్యక్తి రాహుల్‌గాంధీ అన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్మారెడ్డి, గౌస్, సాహెబ్, శ్రీనివాస్‌రెడ్డి, లింగాగౌడ్, గిరిధర్‌రెడ్డి, బాబు, దేవయ్య, రాజునాయక్, బుచ్చాగౌడ్, రాజేందర్, రాములు, రవీందర్ రెడ్డి, దేవానందం, మల్లేశం, మల్లారెడ్డి, రవి, బాల్‌రెడ్డి, దేవయ్య రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని ఇల్లంతకుంట, పొత్తూర్ గ్రామాలలో బుధవారం కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అమలు చేయిస్తున్న ఘనత రాహుల్‌గాంధీకి దక్కుతుందన్నారు. ఎంపీపీ రమణారెడ్డి, మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి, పీసీసీ కోఆర్డినేటర్ రాజేందర్‌రెడ్డి, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వినయ్‌కుమార్, అధికార ప్రతినిధి పసుల వెంకటి, మాజీ ఎంపీపీ అయిలయ్యయాదవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్ విగ్రహం వద్ద రాహుల్‌గాంధీ 54వ జన్మదిన వేడుకలను నిర్వహించారు. జడ్పీటీసీ గుండం నర్సయ్య, ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, తాళ్ల విజయ్‌రెడ్డి, సద్ది మధు, నర్సింలు, రంజాని నరేశ్, రమణారెడ్డి, కనమేని శ్రీనివాస్‌రెడ్డి, తోట ధర్మేందర్, కరుణాకర్, శీల ప్రశాంత్, కుమార్, పెద్దిగారి శ్రీనివాస్, దేవేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంలో రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్, పట్టణ అధ్యక్షుడు పాపగారి రాజు, ఎంపీటీసీ పర్శరాములు, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి రామచంద్రారెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్, పట్టణ అధ్యక్షుడు నేరెళ్ల నర్సింగం గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి లింగాల భూపతి, జిల్లా కార్యదర్శి సత్తు శ్రీనివాస్ రెడ్డి, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి మునిగల రాజు, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు చుక్క శేఖర్, మహిళ అధ్యక్షురాలు ధర్మారెడ్డి హారిక రెడ్డి, మాజీ ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పెద్దూరు తిరుపతి, మైనార్టీ నాయకులు మహమ్మద్ హమీద్, సలీం, మీరాల శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్లలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



ఇల్లంతకుంటలో పాల్గొన్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

వీర్నపల్లి: వీర్నపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ జన్మదిన మండల పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కార్యకర్తలు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్ గౌడ్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు హరిలాల్ నాయక్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రవీందర్, గ్రామ అధ్యక్షుడు చంద్రమౌళి, దేవయ్య, గిరిజన పార్లమెంట్ కోఆర్డినేటర్ గజన్ లాల్ నాయక్, మండల ప్రధాన కార్యదర్శి రాములు నాయక్, మహిళా మండల అధ్యక్షురాలు జోగుల మంజుల, సీనియర్ నాయకులు లక్ష్మణ్, శ్రీనివాస్, జలందర్ తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లి: బోయినపల్లి మండల కేంద్రంలో బుధవారం రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్లపెల్లి వేణుగోపాల్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ముదిగంటి సురేందర్‌రెడ్డి, బోయినపల్లి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టేపల్లి సుధాకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భీమ్‌రెడ్డి మహేశ్వర్‌రెడ్డి. మాజీ జడ్పీటీసీ పులి లక్ష్మీపతిగౌడ్. జిల్లా కాంగ్రెస్ నాయకులు జంగం అంజయ్య ఎంపీటీసీ సభ్యులు ఉయ్యాల శ్రీనివాస్‌గౌడ్, సాంబ లక్ష్మీరాజం, కొంకటి మధు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు ఫిరోజ్‌పాషా ఆధ్వర్యంలో బుధవారం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేతిరెడ్డి లక్మారెడ్డి, రమేష్‌రెడ్డి, ప్రభాకర్, దేవరకొండ చారి, రుక్మిణి, సదానందం, లింబయ్య, పెంతల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి: చందుర్తి మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆది నేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. జడ్పీటీసీ నాగం కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, నాయకులు గొట్టె ప్రభాకర్, దూది శ్రీనివాస్ రెడ్డి, బాణాల రవీందర్ రెడ్డి, భీమరాజు కనకరాజు, పులి సత్తయ్య, బాలు తదితరులు పాల్గొన్నారు.

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలోని ఇందిరా చౌరస్తాలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గట్ల మీనయ్య, ఎర్రం గంగానర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, గండి నారాయణ, కేసీ రెడ్డి నర్సారెడ్డి, మాడిశెట్టి అభిలాష్, ఇప్ప మహేష్, తర్రె లింగం, సూర యాదయ్య, స్వర్గం పరంధాములు, దాసరి గంగరాజం, దిలీప్, ఎర్రం అరవింద్, ఆర్మూర్ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతుల ప్రక్రియ అశాస్త్రీయం



మాట్లాడుతున్న దోర్నాల భూపాల్‌రెడ్డి

సిరిసిల్ల రూరల్, జూన్ 19: ప్రస్తుతం జరుగుతున్న పదోన్నతుల ప్రక్రియ అశాస్త్రీయమని, ఇలా గతంలో ఎప్పుడూ చూడలేదని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దోర్నాల భూపాల్ రెడ్డి అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని గీతానగర్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఏడేళ్ల సుదీర్ఘ కాలంగా ఉపాధ్యాయులు పదోన్నతుల కోసం నిరీక్షిస్తున్నారన్నారు. ఎన్నో అవాంతరాలను ఎదుర్కొని పదోన్నతులు చేబట్టిన పరిస్థితిలో ఇప్పుడు పదోన్నతుల ప్రక్రియని అశాస్త్రీయ పద్ధతిలో చేపట్టడం వలన ఉపాధ్యాయ పోస్టులు పూర్తిగా భర్తీ కావడం లేదన్నారు. ఒక ఉపాధ్యాయునికి ఒకటి కంటే ఎక్కువ పదోన్నతులకు అవకాశం ఉన్నప్పుడు అన్నింటికీ అవకాశం ఇచ్చారని, దీని ద్వారా ఒక పదోన్నతి పోస్టులో చేరినట్లైతే మిగతా పదోన్నతి పోస్టులు ఖాళీగా ఉంటున్నాయని అన్నారు. దాని ద్వారా తర్వాత సీనియారిటీలో ఉన్న ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి మైలారం తిరుపతి నాయకులు బడుగు రాంబాబు, జగిత్యాల శ్రీనివాస్, రవిబాబు, తిరుపతి, నరేందర్, రమేశ్‌తదితరులు పాల్గొన్నారు.

భూములపై హక్కులు కల్పించాలి

ముస్తాబాద్, జూన్ 19 :భూములపై తమకు పూర్తిగా హక్కులు కల్పించాలని ముస్తాబాద్ తహ సీల్దార్‌కు ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పుల్లూరి రవి, జడ్పీటీసీ సభ్యుడు గుండం నర్సయ్య బుధవారం వినతిపత్రాన్ని అందించారు. ముస్తాబాద్ మండల కేంద్రంలో ముదిరాజ్ కులస్థులకు ప్రభు త్వం 11 ఎకరాల 20 గుంటల స్థలాన్ని 984 సర్వే నంబరులో లింగం కుంట వద్ద కేటాయించిందన్నారు. దాదాపు 40 సంవత్సరాలుగా ఆ భూమిలో ఉంటూ జీవనాధారం పొందుతున్నారన్నారు. మామిడితోట పెట్టుకోవడానికి అనుమతులు ఇవ్వాలని, 40 సంవత్సరాలుగా కాస్తులో ఉన్న ముదిరాజ్ కుటుంబాలు దాదాపు 200 మందికి చెందేలా చూడాలని అన్నారు. ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పుల్లూరి రవి, జడ్పీటీసీ గుండం నర్సయ్య, ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, దీటి నర్సింలు, రంజాని నరేశ్, ముదిరాజ్ సంఘం సభ్యులు పిట్ల విఠల్, సత్యనారాయణ, రాంగోపాల్, రంజాని రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానులపై కేసులు



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, జూన్ 19: మైనర్లు వాహనాలు నడిపితే యజమానులపై కేసులు పెడతామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణంలోని టౌన్ పోలీస్‌స్టేషన్‌లో జిల్లా వ్యాప్తంగా వాహనాలు నడిపి పట్టుబడిన మైనర్లు వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు, వాహన యజమానులు వాహనాలు నపాలని మైనర్లను ప్రోత్సహించడం చట్టరీత్య నేరమన్నారు. తెలిసీ తెలియని డ్రైవింగ్‌తో వాహనం నడపడం ద్వారా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని మైనర్ డ్రైవింగ్‌పై జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని, 361 వాహనాలు సీజ్ చేశామని అన్నారు. కారణం లేని మరణం ఒక రోడ్డు ప్రమాదమేనని, ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనలు తెలియని మైనర్‌లకు వాహనాలు ఇచ్చి ప్రోత్సహించవద్దని అన్నారు. పిల్లలు వాహనాలు కావాలని తల్లిదండ్రులను బెదిరించినా, తెలియకుండా తీసుకెళ్లినా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆ వాహనాన్ని సీజ్ చేస్తామన్నారు. పిల్లలకు వాహనాలు ఇవ్వడంతో ఏవైన సంఘటనలు జరిగితే కుటుంబం జీవితాంతం బాధపడాల్సి వస్తుందన్నారు. పిల్లలను రోడ్డు ప్రమాదం ద్వారా దూరం చేసుకోవడం కుటుంబస్యులకు తల్లిదండ్రులకు తీరని లోటన్నారు. మైనర్ డ్రైవింగ్, రోడ్డు నిబంధనలు, ట్రాఫిక్ నిబంధనలపై జిల్లాలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మైనర్లకు వాహనాలు ఇవ్వబోమని ప్రతిజ్ఞ చేయించారు. డీఎస్పీ నాగేంద్రచారి, సీఐలు సదన్‌కుమార్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, ఎస్సైలు పాల్గొన్నారు.

అనుమానితులు కనిపిస్తే సమాచారం ఇవ్వండి



మాట్లాడుతున్న డీఎస్పీ నాగేంద్రచారి

రుద్రంగి, జూన్ 19: గ్రామంలో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని వేములవాడ డీఎస్పీ నాగేంద్ర చారి అన్నారు. నేరాల నియంత్రణలో భాగంగా బుధవారం రుద్రంగి మండల కేంద్రంలోని నేవురిపల్లెలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ నాగేంద్రచారి మాట్లాడుతూ సమస్యలు నేరుగా తెలుసుకొనే అవకాశం ఉంటుందని కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ఎవరైనా కొత్త వ్యక్తులు, నేరస్తులు షెల్టర్ తీసుకుంటున్నారా? అనే విషయం తెలుస్తుందన్నారు. నేర రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలనేది ఎస్పీ ముఖ్య ఉద్దేశమన్నారు. మాదక ద్రవ్యాలను, గంజాయి వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని, గ్రామాల్లో గంజాయికి సంబంధించిన సమాచారం ఉంటే పోలీస్‌లకు అందించాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. పేపర్లు, నంబర్ ప్లేట్స్ లేని 30 ద్విచక్ర వాహనాలు, ఒక ట్రాక్టర్ సీజ్ చేశామన్నారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా తిరిగితే వెంటనే పోలీసులకు ఫోన్ చేయాలని లేదా డయల్ 100 కాల్ చేయాలని అన్నారు. వెంటనే చర్యలు తీసుకుంటారన్నారు. గ్రామాల్లో స్వీయ రక్షణ కోసం సీసీ కెమెరాలను అమర్చుకోవాలన్నారు. ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 ట్రోల్ ఫ్రీ నంబరుకి కాల్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ వెంకటేస్వర్లు, ఎస్సై అశోక్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

ఎల్లారెడ్డిపేట, జూన్ 19: గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని సెస్ డైరెక్టర్ కృష్ణహరి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణహరి మాట్లాడుతూ నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యమన్నారు. గ్రామాల్లోని సమస్యలను తమ దృష్టికి తీసుకు వస్తే పరిష్కరిస్తామన్నారు. వినియోగదారులు సకాలంలో బిల్లులు చెల్లించి సంస్థ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ ఏఈ పృథ్వీధర్, నాయకులు శేఖర్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

పవర్‌లూం పరిశ్రమలో విద్యుత్ సమస్యను పరిష్కరించాలి

సిరిసిల్ల రూరల్, జూన్ 19 : వస్త్ర పరిశ్రమలో నెలకొన్న విద్యుత్ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని, నేతన్నలకు ఉపాధి కల్పించాలని సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్ తెలిపారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 21న సిరిసిల్లలో నేతన్నల సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. విద్యుత్ చార్జీల భారాన్ని తట్టుకోలేక పవర్‌లూం పరిశ్రమలు మూతపడుతున్నాయన్నారు. రోజురోజుకు మరమగ్గాలను పగులగొట్టి ఇనుప సామగ్రి అమ్ముతున్నారన్నారు. సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ అధ్వర్యంలో ఈనెల 21వ తేదీన సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్ భవాని ఫంక్షన్ హాల్‌లో నేతన్నల సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కోడం రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

ఇల్లంతకుంట, జూన్ 19 : ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని వైస్ ఎంపీపీ సుదగోని శ్రీనాథ్‌గౌడ్ అన్నారు. మండలంలోని వంతడుపుల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో రుచికరమైన మధ్యాహ్న భోజనంతో పాటు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జలేందర్‌రెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ జ్యోతి, అరుణ, స్వప్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కారోబార్ల సమస్యలను పరిష్కరించాలి

వీర్నపల్లి, జూన్ 19 : రాష్ట్ర ప్రభుత్వం కారోబార్ల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు గుర్రపు సురేష్ అన్నారు. వీర్నపల్లి మండల కారోబార్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అంతకుముందు సమస్యలపై బుధవారం వినతి పత్రం అందించారు. కారోబార్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు న్యాత నర్సయ్య, సభ్యులు వెంకటరమణ, మహేందర్, శ్రీనివాస్, శేఖర్, మహేష్ తదితరులు ఉన్నారు.

అధిక ఫీజు నియంత్రించాలి

భగత్‌నగర్, జూన్ 19: జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో అధిక ఫీజు వసూళ్లను నియంత్రించాలని పీడీఎస్‌యు ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో ఏవో సుధాకర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యు జిల్లా అధ్యక్షుడు రత్నం రమేష్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్, పాఠశాలలు, కళాశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించకుండా విద్యాసంస్థల్ని నడుపుతున్నార న్నారు. బుక్స్, యూనిఫామ్స్, టై,బెల్ట్ అమ్ముతూ వ్యాపారం చేస్తున్నారన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న విద్యాసంస్థల గుర్తింపు రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాకేష్, సందీప్, నవీన్, శ్రీకాంత్, సృజన్, తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, జూన్ 19: నేరాలను నియంత్రించడంలో సీసీ కెమెరాల పాత్ర ఎంతో కీలకమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. దేవదాయశాఖ సహకారంతో పోలీస్‌లు పట్టణంలో 45 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్‌మహాజన్‌తో కలిసి ప్రభుత్వ విప్ బుధవారం సీసీ కెమెరాలను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక క్షేత్రం కావడంతో నిత్యం వేల సంఖ్యలో భక్తులు వేములవాడకు తరలివస్తుంటారని, సీసీ కెమెరాలతో నేరాలను ఛేదించడం సులభంగా మారుతుందని అన్నారు. శాంతి భద్రతలు ఎక్కడైతే పటిష్ఠంగా ఉంటాయో అక్కడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ప్రజల రక్షణ, భద్రతపై పోలీసులు ఎల్లవేళలా పని చేస్తారన్నారు. ప్రజలు స్వేచ్ఛగా, స్వతంత్రంగా జీవించడానికి పోలీసు సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. జిల్లా పోలీస్‌శాఖ శాంతి భద్రతల పర్యవేక్షణతోపాటు సామాజిక కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. దేశ భవిష్యత్‌ను నిర్ణయించే యువత గంజాయి, మత్తుపదార్థాల బారిన పడకుండా సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జిల్లా పోలీస్ శాఖ డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చడానికి వినూత్న కార్యక్రమాలు చేపడుతోందన్నారు. డి- అడిక్షన్ సెంటర్ ఏర్పాటుతోపాటు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. వేములవాడ పట్టణంలోని ప్రతీ కాలనీలో ప్రజలు, వ్యాపారస్తులు, ప్రజాప్రతినిధులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలని సూచించారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

జిల్లాలోని పట్టణాలు, గ్రామాలు, వార్డులతోపాటు ఇళ్ల ముందర సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే నేరాలను తగ్గించవచ్చని ఎస్పీ అఖిల్‌మహాజన్ అన్నారు. ఇంటి ముందు సీసీ కెమెరాలు ఉంటే దొంగలు భయపడుతారన్నారు. ప్రతీ ఇంటా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వంద మంది చేసే పనిని సీసీ కెమెరా ఒక్కటి నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ నాగేంద్రచారి, సీఐలు వీరప్రసాద్, శ్రీనివాస్, రాజన్న ఆలయ ఈఈ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.